నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, సోమవారం 15 జూలై 2024 | VIKARABAD

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం
- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, జూలై 14 : జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించినట్లు తెలిపారు. భారీ వర్షాలతో రోడ్లు కొట్టుకుపోవడం, ఉద్యాన పంటలు, ప్రాణనష్టం జరుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అత్యవసర సహాయం కోసం విపత్తుల నిర్వహణ సంస్థ ప్రజలకు అందుబాటులో ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

రంగారెడ్డి జిల్లాకు మహర్దశ

- మహేశ్వరంలో కొత్త నగరాన్ని నిర్మిస్తాం
- రాచకొండ ప్రాంతంలో అద్భుతమైన ఫిల్మ్ ఇండస్ట్రీని ఏర్పాటు చేస్తాం
- కాటమయ్య రక్షణ కవచం' కిట్ల పంపిణీలో సీఎం రేవంత్‌రెడ్డి

పాల్గొన్న శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్, మంత్రులు పొన్నం, జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే

కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో శాసనసభాపతి ప్రసాద్‌కుమార్, మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

రంగారెడ్డి, జూలై 14 (నమస్తే తెలంగాణ)/ అబ్దుల్లాపూర్‌మెట్ : అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని లష్కర్‌గూడలో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించిన సందర్భంగా జిల్లాపై వరాల జల్లు కురిపించారు. 'కాటమయ్య రక్షణ కవచం' కిట్ల పంపిణీ పథకాన్ని ఇక్కడి నుంచే లాంఛనంగా ప్రారంభించిన ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. హయత్‌నగర్‌కు త్వరలోనే మెట్రోరైల్ రాబోతున్నదని.. ఇందుకు సంబంధించిన అన్ని ప్రణాళికలు పూర్తయ్యాయన్నారు. ఫార్మా కంపెనీల కోసం సేకరించిన భూమిలో పలు యూనివర్సిటీలు, మెడికల్, టూరిజం, పరిశ్రమలను ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. రీజనల్ రింగ్ రోడ్డుతోపాటు భవిష్యత్తులో రేడియల్ రోడ్లను అభివృద్ధి చేస్తామన్నారు. న్యూయార్క్ సిటీతో పోటీపడేలా మహేశ్వరంలో ఒక అద్భుతమైన నగరాన్ని నిర్మించే బాధ్యతను తమ ప్రభుత్వం తీసుకుంటుందని ప్రకటించారు. ఊటీ కంటే అద్భుతంగా రాచకొండ ప్రాంతాన్ని ఫిల్మ్ ఇండస్ట్రీకి అనువుగా మార్చుతామన్నారు. రంగారెడ్డి జిల్లాకు మహర్దశ రాబోతున్నదని, ప్రపంచంలోనే అద్భుతమైన పర్యాటక కేంద్రంగా జిల్లాను తీర్చిదిద్దుతామని తెలిపారు. కార్యక్రమంలో శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్‌రెడ్డి, ఎగ్గె మల్లేశం, ఏవీఎన్ రెడ్డి, దయానంద్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, మాజీ ఎంపీ మధు యాష్కీగౌడ్, బీసీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, కలెక్టర్ శాంక, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ఆర్డీవో అనంత్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎంకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నానికి పరిశ్రమలు తేవాలి

గడ్డిఅన్నారం పండ్ల మార్కెట్‌ను త్వరగా పూర్తి చేయడంతోపాటు విజయవాడ జాతీయ రహదారి వెంట నూతన పరిశ్రమలను ఏర్పాటు చేయాలి. తద్వారా స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్ల పంపిణీ పథకాన్ని ఇబ్రహీంపట్నం సెగ్మెంట్‌లో నిర్వహించడం చాలా సంతోషంగా ఉన్నది. –మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్యే

గౌడ సోదరులకు మంచి జరగాలనే..

గౌడ సోదరులకు మంచి జరగాలనే ఆలోచనతోనే ప్రభుత్వం కాటమయ్య రక్షణ కిట్ల పంపిణీ పథకానికి శ్రీకారం చుట్టింది. ఇది ప్రజాప్రభుత్వం. సర్కారు ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేర్చుతుంది.

- చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎంపీ

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

అబ్దుల్లాపూర్‌మెట్ : మండలంలోని లష్కర్‌గూడ గ్రామానికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డిని కలిసేందుకు మధ్యాహ్న భోజన కార్మికులు రాగా పోలీసులు అడ్డుకుని ముఖ్యమంత్రిని కల్పిస్తామని చెప్పి కల్పించకపోవడంతో ఆగ్రహించిన వారు సభలో కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. దీంతో సీఎం జోక్యం చేసుకొని వారిని ఏమి అనొద్దని పోలీసులకు చెప్పి వారి వద్దకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని పంపించి వారు ఇచ్చిన మెమోరాండాన్ని స్వీకరించారు. సీఎంను కలవాలని రోడ్డుకు అడ్డంగా ఉండి కార్మికులు నినాదాలు చేయడంతో పోలీసులు కార్మికుల మధ్య వాగ్వివాదం జరిగింది. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మిక సంఘం రాష్ట్ర నాయకురాలు స్వప్న, సీఐటీయూ జిల్లా నాయకుడు నర్సింహ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయ పాత్రకు ఇవ్వొద్దన్నారు. ఈ సంస్థకు అప్పగిస్తే ఎంతటి పోరాటానికైనా సిద్ధమని హెచ్చరించారు. సీఐటీయూసీ నాయకులు కృష్ణ, ఎల్ల య్య, గణేశ్, మధ్యాహ్న భోజన కార్మికులు లక్ష్మమ్మ, నిర్మలమ్మ, రమాదేవి, రంగమ్మ, పుష్ప, స్వరూప, రాజమణి, నాగరాణి ఉన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులను అడ్డుకుంటున్న పోలీసులు

నీటి లెక్క పక్కాగా..!

- అడుగంటుతున్న భూగర్భ జలాలతో ప్రభుత్వం అప్రమత్తం
- పరిశ్రమల్లో నీటి వృథాను అడ్డుకునేందుకు చర్యలు
- ప్రతి బోరుకూ మీటరు ఏర్పాటు చేసేందుకు భూగర్భ జల శాఖ కసరత్తు
- ఇప్పటికే జిల్లాలో మొదలైన ప్రక్రియ

రంగారెడ్డి, జూలై 14 (నమస్తే తెలంగాణ) : భూగర్భ జలాలు రోజురోజుకూ అడుగంటుతుండడం ఆందోళన కలిగిస్తున్నది. నీటి సంరక్షణకు చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తు తరాలకు ముప్పు వాటిల్లుతుంది. ఈ ఉపద్రవానికి ముందే చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరిస్తున్నది. నీటి వృథాను అరికట్టే దిశగా చర్యలు తీసుకుంటున్నది. ముఖ్యంగా పరిశ్రమల్లో వివిధ అవసరాల నిమిత్తం బోర్ల నుంచి విచ్చలవిడిగా నీటిని తోడుతున్నారు. దానిని నియంత్రించేందుకు బోర్లకు మీటర్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ప్రక్రియ రంగారెడ్డి జిల్లాలో ఇప్పటికే మొదలు కాగా.. భూగర్భజల శాఖ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టి బోర్లకు నీటి మీటర్లను ఏర్పాటు చేయిస్తున్నారు.

వృథాకు అడ్డుకట్ట..

జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా, భారీ, మెగా పరిశ్రమలు కలిపి మొత్తం 4,428 వరకు ఉన్నాయి. పరిశ్రమల నిర్వహణ కోసం బోర్లను ఇష్టానుసారంగా వేస్తున్నారు. పరిశ్రమలు స్థాపించే సమయంలో ఒకటి, రెండు బోర్లకు మాత్రమే అనుమతులు పొంది ఆ తర్వాత పెద్ద సంఖ్యలో బోర్లు వేసుకుని నీటిని వాడుతున్నారు. ఆయా బోర్ల నుంచి జలాలను ఇష్టం వచ్చినట్లు తోడేస్తుండడంతో.. ఈ ప్రభావం భూగర్భజలాలపై పడుతున్నది. వాస్తవానికి ఎన్ని బోర్లు అవసరం? నిత్యం ఎన్ని లీటర్ల నీటిని వాడుతున్నారు..? తదితర విషయాలను ఎప్పటికప్పుడు పరిశ్రమల నిర్వాహకులు తెలియజేయాల్సి ఉంటుంది. కానీ..ఇది ఎక్కడా అమలుకావడం లేదు. కొన్ని పరిశ్రమలు ఇష్టానుసారంగా బోర్లు వేసి నీటిని వాడుతున్నాయి. పరిస్థితి ఇలానే కొనసాగితే భవిష్యత్తు తరాలకు నీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదమని భావించిన ప్రభుత్వం నీటి లెక్కలు తేల్చేందుకు సిద్ధమైనది. వెయ్యి లీటర్లకు ప్రభుత్వం నిర్దేశించిన మేర రుసుమును పరిశ్రమల నిర్వాహకులు చెల్లించాల్సి ఉంటుంది. ప్రతి మూడేండ్లకొకసారి రెన్యువల్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఈ విధానంతో వృథా నీటికి అడ్డుకట్ట పడడంతోపాటు ప్రభుత్వానికి కొంతమేర ఆదాయం సమకూరనున్నది.

విడతల వారీగా అమలు..

భూగర్భజల శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశ్రమల్లోని బోర్లను పరిశీలిస్తున్నారు. పరిశ్రమల నిర్వాహకులు వాడుకుంటున్న బోర్ల లెక్కలను తీస్తున్నారు. అనుమతులు ఉన్నవి ఎన్ని? లేనివి ఎన్ని? అన్న వివరాలను సేకరిస్తున్నారు. అనుమతులు లేకపోతే నోటీసులు జారీ చేసి బోర్లకు నీటి మీటర్లను ఏర్పాటు చేయిస్తున్నారు. జిల్లాలో 400లకు పైగా పరిశ్రమలు టీజీఐపాస్ ద్వారా అనుమతులను పొంది ఉండడంతో వాటికి మీటర్లను ఏర్పాటు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. మరో 200 పరిశ్రమలకు ఎటువంటి అనుమతులు లేకపోవడంతో వాటన్నింటికీ నోటీసులు అందజేశారు. వాటిల్లో ఇప్పటికే 125 పరిశ్రమలకు మీటర్ల ఏర్పాటు సంబంధించి చర్యలు మొదలైనట్లు అధికారులు చెబుతున్నారు. పరిశ్రమలతోపాటు కొంతమంది రిసార్ట్స్ నిర్వాహకులు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, ఫంక్షన్‌హాళ్లు, హోటళ్లు, మినరల్ వాటర్ ప్లాంట్లు, రైస్‌మిల్లుల నిర్వాహకులు బోర్ల ద్వారా పెద్ద ఎత్తున నీటిని వాడుకుంటున్నారు. ఈ క్రమంలో వీటిపైనా అధికారులు దృష్టి కేంద్రీకరించారు. ఇప్పటికే జిల్లాలో 24 రిసార్ట్స్‌ను గుర్తించి నోటీసులు ఇచ్చారు. 19 మంది రిసార్ట్స్ నిర్వాహకులు బోర్లకు మీటర్లు ఏర్పాటు చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. విడతల వారీగా బోర్ల ద్వారా నీటిని వాడుకుంటున్న వారందరూ మీటర్లు ఏర్పాటు చేసుకోవడం తప్పనిసరి అని, ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు భూగర్భజల శాఖ అధికారులు చెబుతున్నారు.

జలమయమైన రహదారి

దంచికొట్టిన వాన

అత్యధికంగా 7.75 సెం.మీల వర్షపాతం నమోదు

సిటీబ్యూరో, జూలై 14 (నమస్తే తెలంగాణ)/ ముషీరాబాద్ : బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తనానికి తోడు నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతుండటంతో ఆదివారం గ్రేటర్‌లోని పలు ప్రాంతాల్లో వర్షం దంచి కొట్టింది. మారేడ్‌పల్లిలోని న్యూమెట్టుగూడలో రాత్రి 9 గంటల వరకు అత్యధికంగా 7.75 సెం.మీల వర్షపాతం నమోదైనట్లు టీజీడీపీఎస్ అధికారులు వెల్లడించారు. వర్షం నీరు కారణంగా లోతట్టు ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి. ముషీరాబాద్ రాంనగర్ ఆదర్శ అపార్టుమెంట్ సమీపంలో వరద నీటి లో కారుతో సహా నలుగురు చిక్కుకుపోయారు.

స్థానికులు కారు అద్దాలు పగులగొట్టి వారిని కాపాడారు. కాగా, న్యూమెట్టుగూడలో 7.75సెం.మీ, యూసుఫ్‌గూడలో 7.65, ముషీరాబాద్‌లో 7.3, జూబ్లీహిల్స్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో 7.2, హెచ్‌సీయూ, శేరిలింగంపల్లి, మాదాపూర్‌లలో 6.95, నాచారంలో 6.88, సీతాఫల్‌మండి లో 6.85, ముషీరాబాద్‌లోని తాళ్లబస్తీలో 6.3, బన్సీలాల్‌పేట, మోండా మార్కెట్‌లలో 6.28, పాటిగడ్డ, బుద్ధానగర్‌లలో 6.15, ఉప్పల్ చిలుకానగర్ లో6 అల్లాపూర్, ఉస్మానియా యూనివర్సిటీ లలో 5.90, రహ్మత్‌నగర్, భోలక్‌పూర్‌లలో 5.73, మౌలాలి, ఓల్డ్ సుల్తాన్‌నగర్‌లలో 5.55, గచ్చిబౌలి, ఉప్పల్‌లలో 5.40, ఖైరతాబాద్, బేగంపేట, షేక్‌పేటలలో 5.20 సెం.మీల వర్షపాతం నమోదైంది. ఆవర్తనం ప్రభావంతో రాగల మరో మూడు రోజులు భారీ నుంచి అతిభారీ వానలు కురిసే అవకాశమున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రేటర్‌కు ఎల్లో అలర్ట్ హెచ్చరికలు జారీచేశారు.

మెట్రో రెండో దశకు అడ్డంకులు

- క్షేత్ర స్థాయి సర్వేలో స్పష్టత కరువు
- డీపీఆర్ రూపకల్పనలో జాప్యం
- వ్యయంపై అంచనాలు తారుమారు

సిటీబ్యూరో, జూలై 14 (నమస్తే తెలంగాణ): మెట్రో రెండో దశ ప్రాజెక్టుకు ఆదిలోనే ఎన్నో అడ్డంకులు ఎదురవుతున్నాయి. నిర్దేశిత లక్ష్యాలు పెట్టుకున్నా అవి సకాలంలో పూర్తి చేయలేకపోతున్నారు. ఒకవైపు జనరల్ కన్సల్టెన్సీ సంస్థ, మరోవైపు హైదరాబాద్ మెట్రో అధికార యంత్రాంగం క్షేత్ర స్థాయిలో చేపట్టిన ట్రాఫిక్ సర్వే, నిర్ణీత కారిడార్ల అధ్యయనంలో స్పష్టత రావడం లేదు. ఇదే విషయమై హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) పరిధిలోని ఉమ్టా (యునిఫైడ్ మెట్రో ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ) సంస్థ ప్రత్యేకంగా మరో అధ్యయాన్ని నిర్వహిస్తున్నది. రెండో దశపై ఎంతో కసరత్తు చేస్తున్నా సమగ్ర ప్రాజెక్టు నివేదికపై కొలిక్కి రావడం లేదు. ఫలితంగా మే–జూన్ నాటికే సిద్ధం కావాల్సిన రెండోదశ మెట్రో డీపీఆర్ రూపకల్పనలో తీవ్ర జాప్యం కావడంతోపాటు ప్రాజెక్టుకు అయ్యే వ్యయంపై అంచనాలు సైతం తారుమారు అవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండో దశ మెట్రోను 70 కి.మీ మేర విస్తరించాలని ఎంతో హడావిడి చేసి ఏడు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఒక అంచనాకు రాలేదు. మొత్తం 7 మెట్రో మార్గాల్లో 70 కి.మీ మేర రెండో దశలో మెట్రోను పొడిగించేలా డీపీఆర్‌ను రూపొందించేపనులు చేస్తున్నా, స్థానికంగా ఉన్న పరిస్థితులతో అధికారులు స్పష్టమైన నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారు.

జాతీయ రహదారుల సంస్థతో సంప్రదింపులు..

రెండో దశ మెట్రోను విస్తరించాలని ప్రతిపాదించిన మార్గాల్లో జాతీయ రహదారులు ఉన్నాయి. మొదటి దశ మెట్రో రైలు మార్గాన్ని పొడిగిస్తూ జాతీయ రహదారులపైనే ఎల్‌బీనగర్–హయత్‌నగర్, మియాపూర్–పటాన్‌చెరు, ఆరాంఘర్ నుంచి కొత్త హైకోర్టు వరకు మెట్రో మార్గాలను నిర్మించేందుకు మెట్రో యంత్రాంగం సర్వేలు, అధ్యయనాలు చేస్తున్నది. దీంతో ఒకవైపు జాతీయ రహదారుల విస్తరణలో భాగంగా ఫ్లైఓవర్ల నిర్మాణ పనులు జరుగుతుండగా, అక్కడ మెట్రోకోసం రైట్ ఆఫ్ వే కోసం మెట్రో అధికారులు జాతీయ రహదారుల సంస్థ అధికారులతో సంప్రదింపులు జరిపారు. ఆయా మార్గాల్లో మెట్రో కారిడార్లను ఎలా నిర్మించాలన్న దానిపై స్పష్టత రావాలంటే చాలా సమయమే పడుతుందని ఇటీవల చేపట్టిన సర్వే, అధ్యయనంలో గుర్తించారు. ఇప్పటికే జాతీయ రహదారులపై ఫ్లైఓవర్ వంతెనలు నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేయడంతో మెట్రో అలైన్‌మెంట్‌లో పెద్ద ఎత్తున మార్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని, ఈ కారణంగా ప్రాజెక్టు అంచనా వ్యయం సైతం పెరిగిపోయే అవకాశాలు ఉన్నాయని ఓ మెట్రో అధికారి తెలిపారు. మొత్తం రెండో దశ మెట్రో డీపీఆర్‌పై పూర్తి స్పష్టతకు మరింత సమయం తీసుకోవాల్సిన అవసరం ఏర్పడుతుందన్న అభిప్రాయాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు.

ఎల్‌సీ.. వెయిట్ అండ్ సీ..

లైన్ క్లియరెన్స్ కోసం విద్యుత్ కాంట్రాక్టర్ల ఎదురుచూపులు

సిటీబ్యూరో, జూలై 14 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు నగర శివారు ప్రాంతాల్లో విద్యుత్ అవసరాల కోసం సంస్థలు, ప్రైవేట్ వ్యక్తులు కొత్తగా లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకుంటారు. అలాంటి వారికి పనులు పూర్తైన వెంటనే కాంట్రాక్టర్లు విద్యుత్ సరఫరాను అందించేందుకు ఎల్‌సీ (లైన్ క్లియరెన్స్) తీసుకోవాల్సి ఉంటుంది. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్‌ఎస్‌పీడీసీఎల్) పరిధిలో 5–6 నెలల్లో సుమారు రూ.60 కోట్లకు పైగానే చేపట్టిన పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. వాటికి ఎల్‌సీ ఇవ్వాల్సిన బాధ్యత విద్యుత్ శాఖపై ఉన్నది.

కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేసి 4–5 నెలలుగా ఎదురుచూస్తున్నా వాటికి వెంటనే ఎల్‌సీలు ఇవ్వడం లేదు. ఈ అంశంపై కాంట్రాక్టర్లు ఆందోళన చేస్తున్నా.. పట్టించుకోవడం లేదు. మొక్కుబడిగా అప్పుడప్పుడు ఎల్‌సీలు ఇస్తున్నారే తప్ప, నిరంతర ప్రక్రియగా ఉండాల్సిన ఎల్‌సీలను కొన్ని రోజులు బ్యాన్ చేశారని విద్యుత్ కాంట్రాక్టర్లు వాపోతున్న పరిస్థితి నెలకొన్నది. రోజులు, నెలలు గడుస్తున్నా డిస్కం పరిధిలో వందలాది మంది కాంట్రాక్టర్లు ఎల్‌సీ కోసం ఎదురుచూసి.. ఇటీవల ఖైరతాబాద్‌లోని కార్పొరేట్ కార్యాలయానికి వచ్చి ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఇదే విషయమై అనేకసార్లు డిస్కం సీఎండీని సైతం కలిసి విజ్ఞప్తి చేసినా ఫలితం లేదని కాంట్రాక్టర్లు వాపోతున్నారు.

'కోట్లాది రూపాయలు వెచ్చించి కాంట్రాక్టర్లు పనులు చేసినా.. సకాలంలో ఎల్‌సీలు ఇవ్వకపోవడంతో పనులు అప్పగించిన వినియోగదారులు మాపై తీవ్ర ఒత్తిడి పెంచుతున్నారు. ఈ విషయంలో డిస్కం అధికారులు సర్కిళ్ల వారీగా ఎల్‌సీలు ఎక్కడెక్కడ ఇవ్వాల్సి ఉందో గుర్తించాలి' అని తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జీసీరెడ్డి అన్నారు.

ధర్నాలో పాల్గొన్న డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులు

ఈ డబుల్‌లో ఎట్లుండాలి..?

కాంగ్రెస్ సర్కారుపై లబ్ధిదారుల ఆగ్రహం

కనీస సదుపాయాలు లేవంటూ..మండిపాటు

ఇందిరాపార్కు వద్ద ధర్నా

సిటీబ్యూరో/చిక్కడపల్లి, జూలై 14 (నమస్తే తెలంగాణ) : సొంతింటి కల సాకారమైందన్న ఆనందాన్ని కాంగ్రెస్ సర్కారు దూరం చేస్తున్నది. డబుల్ బెడ్రూం ఇండ్లకు మౌలిక వసతులు కల్పించాల్సిన ప్రభుత్వం.. ఎనిమిది నెలలుగా ఏ ఒక్క పనిని పూర్తి చేయలేదు. తాగునీరు, కరెంట్, రహదారి, లిఫ్ట్ లేక లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. వెంటనే డబుల్ బెడ్రూం ఇండ్ల వద్ద కనీస మౌలిక వసతులు కల్పించాలంటూ ఆదివారం ఇందిరాపార్కు వద్ద లబ్ధిదారులు ధర్నా చేపట్టారు. గ్రేటర్ నలుమూలల నుంచి లబ్ధిదారులు భారీగా తరలివచ్చి నిరసనలో పాల్గొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం దాదాపు 65వేలకు పైగా లబ్ధిదారులకు ఇండ్లను పంపిణీ చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు దాటినా.. ఆ ఇండ్ల సముదాయాల్లో మంచినీరు, కరెంటు, రోడ్డు సదుపాయాలు కల్పించలేదని లబ్ధిదారులు మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని వసతులు కల్పించి డబుల్ బెడ్రూం ఇండ్లలో ఉండేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ నాగేశ్వర్ మాట్లాడుతూ డబుల్ బెడ్రూం ఇండ్ల ప్రాంతాల్లో మంచినీటితోపాటు కరెంట్, రోడ్డు , లిఫ్ట్ ఏర్పాటు చేయాలన్నారు. మౌలిక వసతులు కల్పించేందుకు రూ.700 కోట్లు అవసరమని ,రానున్న రాష్ట్ర బడ్జెట్‌లో డబుల్ బెడ్రూం ఇండ్లకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

ట్రేడ్ లైసెన్స్‌లేకుండానే.. బిజినెస్

జోన్	ఫీజు చెల్లించిన వ్యాపారస్తులు	వచ్చిన ఆదాయం (రూ.లక్షల్లో)
ఎల్బీనగర్	15023	1169.15
చార్మినార్	12311	544.96
ఖైరతాబాద్	18239	1735.77
శేరిలింగంపల్లి	11303	2627.78
కూకట్‌పల్లి	13499	1015.27
సికింద్రాబాద్	17115	2163.9

రెన్యువల్ ఫీజులు చెల్లించని 1.60 లక్షల మంది వ్యాపారులు

స్పెషల్ డ్రైవ్‌తో చర్యలకు సిద్ధమైన బల్దియా

సిటీబ్యూరో, జూలై 14 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో ట్రేడ్ లైసెన్స్‌లు లేకుండా, ఫీజులు ఎగ్గొడుతున్న వ్యాపారస్తులపై బల్దియా స్పెషల్ డ్రైవ్‌కు సిద్ధమైంది. నగరవ్యాప్తంగా లక్షల్లో వ్యాపారాలు కొనసాగుతుంటే ట్రేడ్ లైసెన్స్‌లు మాత్రం పెరగడం లేదు. ఈ నేపథ్యంలోనే లైసెన్స్‌లు లేకుండా వ్యాపారస్తులు, ఫీజులు చెల్లించని వారిపై స్పెషల్ డ్రైవ్ చేపట్టి ఆదాయం పెంచుకోవాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే ఒక్కో సర్కిల్‌కు 20 ప్రత్యేక బృందాలను నియమించారు. వ్యాపారం చేస్తున్న వారిని గుర్తించి, ట్రేడ్ లైసెన్స్ ఉందా? లేదా? చెక్ చేయనున్నారు. లైసెన్స్ లేకపోతే పెనాల్టీతో పాటు ఫీజులూ వసూలు చేయనున్నారు. ట్రేడ్ లైసెన్స్‌లు రెన్యువల్ చేసుకోని వారిపై చర్యలు తీసుకోనున్నారు. ఇప్పటి వరకు 1.60 లక్షల మంది రెన్యువల్ ఫీజు చెల్లించలేదు. దీంతో దాదాపు రూ. 505 కోట్ల మేర వీరి నుంచి ఆదాయం వస్తుందని అధికారులు అంచనాతో ఈ డ్రైవ్ చేపడుతున్నారు.